31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం,ఆగస్టు 08 ,2026 పేజీలు : 8



## జిల్లాలో 89.56 శాతం ఓటర్ల

# ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి

- ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రతి పేరును రాజకీయ పార్టీల బీఎల్ఏలు పరిశీలించాలి
- ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాల స్వీకరణ
- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 7 :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమా న్ని భారత ఎన్నికల సంఘం మార్గదర కాల మేరకు పారదర్శకంగా నిర్వహిం చేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రతి పేరును రాజకీయ పార్టీల బీ.ఎల్.ఏ.లు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో రాజకీ య పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో మొత్తం 7,21,032 మంది ఓటర్లలో ఇప్పటివ రకు 6,45,737 మంది ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయడం ద్వారా 89.56 శాతం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో 13,885 మంది మరణించిన ఓటర్లు, 47,142 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు, 2,482 మంది గుర్తించలేని (అఫ్గ్లే ట్రేసబుల్) ఓటర్లు, 11,234 మంది ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో నమోదైన ఓటర్లు గుర్తించిన ట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం ప్రతి పోలింగ్ స్టేషన్లో సగటున 50 నుంచి 100 మంది వరకు ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉన్నందున, రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు తొలగింపునకు గురవుతున్న ప్రతి పేరును పరిశీలించి సంబంధిత రికార్డు లపై సంతకాలు చేయాలని సూచించా రు. బీఎల్వోలు, బీఎల్ఏ లు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందన్నారు. జిల్లాలో సుమారు 43 వేల మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పిం చినప్పటికీ మ్యాపింగ్ లింక్ అందుబా టులో లేకపోవడంతో, వారికి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సమ ర్పిస్తే వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చేందుకు అవకాశం కల్పిస్తామని వివరించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను విభజిస్తూ జిల్లాలో 21 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రతిపాదించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని, సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని, వాటిని అక్టోబర్ 15 నాటికి పరిష్కరించి అక్టోబర్ 19న భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు-మిగతా 2లో

## కరెన్సీ నోట్లపై భారతరత్న

# డా. అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలి





### కేంద్రానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి విజ్ఞప్తి

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 07 :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రాన్ని భారత కరెన్సీ నోట్లపై ముద్రించాలని కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంకు సానుకూల నిర్ణ యం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. ఈ అంశాన్ని తెలం గాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా విజ్ఞప్తి చేసేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. శుక్రవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అనంతరం జంతర్మంతర్లో కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్,ఆయన చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ పరిపాలన స్ఫూర్తి భారతదేశ ప్రజాస్వామ్యానికి శాశ్వత దిక్సూచి అన్నారు.బి ఆర్ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ శిల్పి మాత్రమే కాదని, ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్త గా పేర్కొన్నారు.భారతీయ -మిగతా 2లో

# మహిళపై అత్యాచారం.... నలుగురు అరెస్టు

### వివరాలు వెల్లడించిన మల్యాల సీఐ రాజ్కుమార్




**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 7:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి గ్రామ శివారులోని డబుల్ బెడ్రూమ్ కాలనీలో మహిళపై అత్యాచారం జరిగిన ఘటనలో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. మల్యాల సీఐ రాజ్ కుమార్ కథనం ప్రకారం నిజామాబాద్ జిల్లాకు చెందిన 34 ఏళ్ల మహిళ ఈ నెల 3న డబల్ బెడ్ రూమ్ కాలనీలో పరిచయం ఉన్న మరో మహిళ ఇంటికి వచ్చింది. తనతో సన్నిహితంగా ఉన్న ఓ వ్యక్తితో ఉన్న సమయంలో రాజారాం గ్రామానికి చెందిన శివరాత్రి నరేష్, గుర్రం శ్రీకాంత్, అంజయ్య, మల్లేశం ఇన్నోవా కారులో అక్కడికి వెళ్లారు. నరేష్, శ్రీకాంత్ రూమ్ లోకి చొరబడగా, మరో ఇద్దరు వ్యక్తులు బయట కాపలాగా ఉన్నారని, నరేష్, శ్రీకాంత్ లు మహిళ, వ్యక్తి కలిసి ఉన్న సమయంలో వీడియో తీసి, సదరు వ్యక్తిని బయటకు పంపించారు. తరవాత మహిళను బెదిరించి, దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం వీడియో మహిళకు పంపి బెదిరింపులకు, బ్లాక్ మెయిల్ కు పాల్పడినట్లు పేర్కొన్నారు. తర్వాత కూడా ఫోన్ చేసి రావాలని బెదిరించడంతో బాధిత మహిళ తమకు ఫిర్యాదు చేయడంతో గురువారం సాయంత్రం నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. కేసు నమోదు చేసుకుని, శుక్రవారం రిమాండ్ కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా, నిందితులు నరేష్, శ్రీకాంత్ లపై పలు కేసులు రౌడీ సీట్లు ఉన్నట్టు, మరో ఇద్దరు వ్యక్తులపై కూడా రెండు చొప్పున కేసులున్నట్లు సీఐ వివరించారు. కాగా, నిందితుల వాడిన ఇన్నోవా కారు. వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## వెల్ది హరిప్రసాద్

# నైపుణ్యం స్ఫూర్తిదాయకం

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఖ్యాతిని మరింత చాటాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికుడికి కలెక్టర్ సన్మానం



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, ఆగస్టు 07 :** సిరిసిల్ల కు చెందిన వెల్ది హరి ప్రసాద్ చేనేత నైపుణ్యం స్ఫూర్తిదాయక మని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొ న్నారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్ లో వెల్ది హరిప్రసాద్ సూక్ష్మ మగ్గం, జీ 20 సదస్సు సందర్భంగా దా ని ఉద్దేశాన్ని వివరిస్తూ.. అలాగే వివిధ దేశాల ప్రధానమంత్రుల చిత్రాలతో వస్త్రం తయారీ, పీతాంబరం, అగ్గిపెట్టెలో పట్టే, ఉంగరం, దబ్బనంలో పట్టే చేనేత వస్త్రాలు తయారు చేసి విశేష -మిగతా 2లో

## డిగ్రీ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఎక్సేల్ శిక్షణ..



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 7:** ధర్మపురి పట్టణంలోని మహాత్మా జ్యోతి గురుకుల డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రత్యేక కార్యచరణలో భాగంగా విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ ఫర్ డేటా మేనేజ్మెంట్ అండ్ అనాలసిస్ అనే అంశం పైన రెండు రోజులపాటు విద్యార్థులకు శిక్షణ అందించారు. శాతవాహన విశ్వవిద్యాలయం సౌజన్యంతో రిసోర్స్ పర్సన్ సంజీవరాజు కమల ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ విద్యార్థులకు ప్రొజెక్టర్ సహాయంతో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో విద్యార్థులకు విద్యార్థులకు డేటా ఎంట్రీ, డేటా ఆర్గనైజేషన్, డేటా మేనేజ్మెంట్, మరియు డేటా సమర్థవంతంగా నిర్వహించే పలు విధానాలపై ఉదాహరణలతో వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ ఏలగొండ రాధకిషన్ మాట్లాడుతూ శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. శిక్షణను అందించిన శిక్షకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.శిక్షణ అందించిన శిక్షకులకు శాలువా లు కప్పి సన్మానించారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

## తల్లిదండ్రులను గెంటేసిన కొడుకు

### -ఆశ్రయమిచ్చిన సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరిఅశోక్‌కుమార్

**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 7:** జగిత్యాల జిల్లా కేంద్రంకు చెందిన గొల్లం హన్మాండ్లు ల( 70),కాంతమ్మ (65 ) అనే వృద్ధ తల్లి దండ్రుల ను కన్న కొడుకు సుధాకర్ కోడలు సువర్ణ లు గురువారం రాత్రి గొడవ పెట్టుకొని బలవంతంగా ఇంట్లోంచి గెంటి వేశారు. ధీంతో సదరు వృద్ధుడు సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించాడు. తన ఇంటిలో రాత్రి ఆశ్రయమిచ్చి శుక్రవారం ఉదయమే హరి అశోక్ కుమార్, వారి అసోసియేషన్ ప్రతినిధులతో ఆ తల్లి దండ్రులను వారి ఇంటికి తీసుకెల్లి తండ్రి పేరిట ఉన్న ఇల్లు ను, భూములను పట్టా చేయించుకొని పోషించక భార్య చెప్పుడు మాటలు విని గెంటే సిన విషయం లో తీవ్రంగా మందలించారు.వృద్ధ తల్లి దండ్రుల సంరక్షణ చట్టం ప్రకారం ఆ ఇల్లు, భూములు మళ్ళీ తండ్రి పేరిట కలెక్టర్ కు ఫిర్యాదు చేసి పట్టా మార్పు చేయిస్తామని, 6 మాసాల జైలు శిక్ష పడుతుందని కొడుకు, కోడలును హెచ్చరించారు. కౌన్సిలింగ్ మేరకు ఇక ముందు వెళ్ళ గొట్టమని, పోషణ,, వైద్య ఖర్చులు పెడుతూ సంరక్షిస్తామని నోటరీ అఫిడవిట్ రాసిచ్చి ఆ తల్లి దండ్రుల కు క్షమాపణ చెప్పి వారి ఇంట్లోకి తీసుకెళ్లారు.ఈ కౌన్సిలింగ్ లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా ప్రతినిధులు పి. సి. హన్మంత్ రెడ్డి, గౌరి శెట్టి విశ్వనాథం, బొల్లం విజయ్, పి. అశోక్ రావు,ఎం. డి. యాకూబ్, కరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి




**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 7:** ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బోగ రమేష్ అన్నారు.ఉపాధ్యాయ,విద్యా రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నాలుగు దశల ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాట్లవాయి కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లలో 11వ పీఆర్సీని వెంటనే అమలు చేయడం, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయడం, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం, విద్యా రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించడం ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, శ్రీధర్, హరీష్, సుజాత, నరేష్, రాజేష్, జాఫర్, సతీష్, ప్రతాప్, అనిల్, కృష్ణవేణి, అనిత, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరెన్సీ నోట్లపై భారతరత్న డా. అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలి

**మొదటి పేజీ తరువాయి....** రిజర్వ్ బ్యాంకు ఏర్పాటుకు ముందు జరిగిన ద్రవ్య విధాన చర్చల్లో ఆయన ఆర్థిక ఆలోచనలు, సూచనలు విశేష ప్రభావం చూపాయని వివరించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వల్లనే నాలాంటి ఒక దళితుడు మంత్రి అయ్యే అవకాశం లభించిందని తెలిపారు.రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. బడుగు, బలహీన వర్గాల సాధికారత కోసం తన జీవితాన్నంతా అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్. ఆయన లేకపోతే వెనుకబడిన వర్గాల నేటి సామాజిక, విద్యా, రాజకీయ స్థితిని ఊహించడం కూడా కష్టమేనని మంత్రి అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రతీకగా నిలిచే కరెన్సీ నోట్లపై డాక్టర్ అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించడం ద్వారా రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం పట్ల భారతదేశ నిబద్ధత ప్రపంచానికి మరింత బలంగాచాటిచెప్పినట్లవుతుందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీజీకి దేశం ఇచ్చిన గౌరవం మాదిరిగానే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కూ తగిన జాతీయ గౌరవం దక్కాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటివరకు 26 సార్లకు పైగా జంతర్ మంతర్ వద్ద శాంతియుత ధర్నాలు నిర్వహించినట్లు,ఈ సందర్భంగా నిర్వహించిన "కోలాటంతో ఢిల్లీపై కొట్లాట" కార్యక్రమం విశేష ఆకర్షణగా నిలిచిందాన్నారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జరిపోతుల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## వెల్ది హరిప్రసాద్ నైపుణ్యం స్ఫూర్తిదాయకం



**మొదటి పేజీ తరువాయి...** ప్రతిభ చూపుతున్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన కార్ఖానకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం వెళ్లారు. హరిప్రసాద్ దంపతులకు పుష్ప గుచ్ఛం అందజేసి.. శాలువాతో సన్మానించారు.హరిప్రసాద్ మగ్గంపై పీతాంబరం, అగ్గిపెట్టెలో పట్టే చీరలను తయారు చేసి సిద్ధంగా పెట్టగా, జిల్లా కలెక్టర్ పరిశీలించి.. వాటి తయారీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో చీర తయారీకి ఎంత సమయం పడుతుంది ముడి సరుకు, పెట్టు బడి తదితర అంశాలపై ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వెల్ది హరిప్రసాద్ చేనేత రంగంలో నైపుణ్యం చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తన మగ్గంపై ఎంతో నైపుణ్యంతో చీరలు తయారు చేస్తున్నారని కొనియాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఖ్యాతిని ఇప్పటికే జాతీయస్థాయిలో చాటారని గుర్తు చేశారు. మరిన్ని నూతన ఆవిష్కరణలు చేసి.. సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటాలని ఆకాంక్షించారు. చీరలకు మంచి ప్యాకింగ్ రూపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్, తహసీల్దార్ మహేష్ కుమార్ ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో అషాడమాస బోనం







**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆగస్టు 07 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ దుర్గా మాత అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్దలతో ఆషాడ మాస భోనము ఘనంగా సమర్పించుకున్నారు. తెలంగాణ సంప్రదాయంలో బోనం అనేది అమ్మవారికి ఎంతో ప్రీతికరమైనది.దుర్గా మాతకు అన్నం, బెల్లం, పాలు, పెరుగుతో వండిన దూప దీప నైవేద్యాలను సమర్పించుకున్నారు, పసుపు-కుంకుమలతో వేప ఆకులతో అలంకరించి బోనం పై దీపం వెలిగించి భోనాన్ని దుంపెన రమేష్ వరలక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సమర్పించారు,. ఈ పూజా కార్యక్రమంలో దుంపెన స్రవంతి బిజెపి నాయకురాలు దాసరి పూర్ణిమ , బిసి కాలనీ వాసులు రాజేశ్వరి సద్ది లక్ష్మారెడ్డి నిర్మల, బండారి బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

## జిల్లాలో 89.56 శాతం ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి

**మొదటి పేజీ తరువాయి...** తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా పరిశీలనలో చురుకుగా పాల్గొని, బీఎల్ వోలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్ లత, ఆర్డివోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నం 'చేనేత' కళ..



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 7:** భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా నిలిచింది "చేనేత" కళ అని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు.శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చెమట చుక్కల్ని చీరలుగా మలచి.. మనిషికి నాగరికతను అద్దింది నేత కార్మికులని పేర్కొన్నారు.దేశ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.ప్రాచీన కాలం నుంచే మన దేశంలో మగ్గాల ద్వారా చేనేత ఉత్పత్తి జరిగిందని మొదట్లో ఈ విధానంతో వస్త్ర ఉత్పత్తికి చాలా సమయం పట్టేదన్నారు. ఇంగ్లాండ్ కు చెందిన జాన్ కే 1733 లో ఫ్లై షటిల్ ను కనిపెట్టాక మగ్గం ద్వారా వస్త్రాల ఉత్పత్తి సామర్థ్యం బాగా పెరిగింది అన్నారు.1801 లో జోసెఫ్ ఎం జాకార్డ్ పెద్ద డిజైన్లు రూపొందించే పరికరాన్ని తయారు చేయగా ప్రస్తుతం చేనేత రంగంలో ఉపయోగిస్తున్నారని ఆ పరికరాన్ని జాకార్డ్ గా పిలువ పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు భోగ రాజేశం,మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు,ఉపాధ్యక్షులుగా దాసరి గంగాధర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్,కోశాధికారి ఆడెపు నర్సయ్య,పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు సామల్ల సతీష్,ఉపాధ్యక్షులు సింగని సతీష్,ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజీవ్,కోశాధికారి బొమ్మ కంటి నవీన్,సంయుక్త కార్యదర్శి గంట్యాల ప్రవీణ్,మాజీ అధ్యక్షులు తాటిపాముల విశ్వనాధం, మున్సిపల్ కౌన్సిలర్లు,అష్టమవాడ పెద్దలు, మాజీ అధ్యక్షులు, సంఘ సభ్యులు,చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరానికి వినియోగదారులు సహకరించాలి

**-ఇబ్రహింపట్నం ,మెడిపల్లి విద్యుత్ శాఖ ఎఈలు సతీష్,ప్రశాంత్**





**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఆగష్టు (07) :** విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం,మెడిపల్లి (వెస్టు) ఎఈ లు శ్రీరాముల సతిష్ ,ప్రశాంత్ లు శుక్రవారం అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్రహింపట్నం మండలం లోని గోదుర్, అమ్మకపేట్ 33 /11 కెవి సబిస్టెషన్ లలో రెండవ శనివారం మరమ్మతుల దృశ్య ఉదయం 09:00 గంటల నుండి మధ్యహ్నం 12:00 గంటల వరకు విధ్యుత్ సరఫరా నిలిపి వేయటం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎఈలు పెర్కోన్నారు.

## యుఎస్‌పిసి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపిన ఉపాధ్యాయులు



**చురకలు విలేఖరి,జగిత్యాల, ఆగస్టు, 07 :** రాష్ట్రంలోని ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా యూఎస్పిసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో యూఎస్పిసి ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ పాఠశాలలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. టి ఎస్ ఎస్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందూరి రాజా రెడ్డి కార్యక్రమంలో పాల్గొని మద్దతు ప్రకటించి ఉపాధ్యాయులతో పాటు పాల్గొన్నారు.మధ్యాహ్న భోజనం విరామ సమయంలో డిసిఇబి శిక్షణ కార్యక్రమంలో, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిజేస్తూ నూతన ప్రభుత్వం వచ్చిన వివిధ కారణాలతో కాలయాపన జేస్తూ దాటావేస్తూ, ఆరు డి ఏ లు, పిఅర్సి పెండింగ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూ ఎస్ పి సి బాధ్యులు అంబటి భూమేశ్వర్, దాశెట్టి రవీందర్ రెడ్డి,,సునవత్ రాజు,అచ్చ విజయ్ భాస్కర్,బెజ్జరాపు మురళి, వేణుగోపాల్, రామేశ్వర్, అనిల్ రెడ్డి,నీలం సంపత్,బన్న, గోవింద్, రవీందర్,నరేందర్,రవికంటి పవన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫకీర్ కొండాపూర్‌లో హర్ ఘర్ జల్ కార్యక్రమం



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఆగష్టు (07) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని ఫకిర్ కోండాపుర్ గ్రామంలో శుక్రవారం హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ గ్రామ సర్పంచ్ తోట రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామ ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీటి ప్రాధాన్యత, నీటిని పరిశుభ్రంగా వినియోగించుకోవాల్సిన అవసరం,నీటి ద్వారా వచ్చే వ్యాధుల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో వినియోగిస్తున్న తాగునీటి నమూనాలను సేకరించి నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా నిరంతరం నీటి నాణ్యతను పర్యవేక్షించాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ , సిబ్బంది కనకయ్య ,కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలి

**- ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ లో**
**- ఇబ్రహింపట్నం వ్యవసాయ శాఖ అదికారి అకు రాజ్ కుమార్**



**చురకలు విలేకరి, ఇబ్రహింపట్నం ఆగష్టు 07 :** రైతులకు నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం వ్యవసాయ శాఖ అదికారి అకు రాజ్ కుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పలు ఎరువుల విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి అకు రాజ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, ఈ-పోస్ స్టాక్ వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సులు , ఎంఆర్పీ ప్రకారం ఎరువుల విక్రయాల రిజిస్టర్ లను పరిశీలించారు. భౌతిక నిల్వలు మరియు ఈ-పోస్‌లో నమోదైన స్టాక్ వివరాలను పరిశీలించారు.రైతులకు నాణ్యమైన ఎరువులను మాత్రమే నిర్ణీత ధరలకు విక్రయించాలని, ఎరువులను అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం లేదా ఇతర అవకతవకలకు పాల్పడితే ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు యఫ్ సి ఓ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి

**-సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి చెన్నా విశ్వనాథం**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అగష్టు (07) :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని సిపిఐ పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్నా విశ్వనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6 నుండి 14 వరకు జరగనున్న ప్రచార యాత్రలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ప్రచార యాత్ర నిర్వహించారు. సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి చెన్నా విశ్వనాథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పెరిగిపోతున్న నిరుద్యోగంతో పాటు, ద్రవ్యోల్బణం ధరల పెరుగుదల ప్రజల పై ఒక మోయలేని భారంగా మారిందన్నారు. పెట్రోల్,డీజిల్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగు దలను అరికట్టి, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రచార యాత్రలో సీపీఐ పార్టీ జిల్లా నాయకులు సుతారి రాములు,ఎండి ఉస్మాన్, రాజన్న, వంశీ,రమేష్, మహిళ నాయకురాలు యెన్నం రాధా, శాంతమ్మ, ఫిర్దోష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ శాఖ హెచ్చరించిన చర్యలు చేపట్టలేదు

**-రైతులను ఆగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**
**-మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**చురకలు విలేకరి, సారంగాపూర్/ బీర్పూర్, ఆగస్టు 7 :** ఎల్నినో ప్రభావం గురించి వాతావరణ శాఖ హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టలేదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీటిని ఎగువకు తరలిస్తే కేసిఆర్కు పేరు వస్తుందని ఒక కుట్రపూరితంగా నిర్లక్ష్యం చేయడం జరిగిందని ఆరోపించారు.అదృష్టం కొద్దీ అల్పపీడన ప్రభావం వల్ల ప్రకృతి సహకరించి రైతులలో కొంచెం ఆశలు చిగురించాయని, రైతులు కూడా పూర్తిస్థాయిలో సాగు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.ప్రధాన సమస్యలు విద్యుత్తు, ఎరువులు అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కొన్ని రకాల ఆంక్షలతో తొమ్మిది గంటల విద్యుత్ ఇచ్చేవారని, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత24 గంటల విద్యుత్ ఇచ్చారని గుర్తు చేశారు.పూర్వ పరిస్థితిలో మళ్లీ పునరావృతం అయినట్టుగా కనిపిస్తుందని,రాత్రి వేళలో కరెంటు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయం 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేయగలిగే అవకాశం ఉండగా,ఇప్పుడు కేవలం 100 మెగా వాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి చేస్తుందని,ఇన్లో రెండు లక్షల మించి వస్తుందని తెలిపారు.శ్రీశైలం జలాశయం నుండి ఇంకా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేయలేకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడుతుందని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రెండు సమానమే అంటుంటాడని,కానీ ఆయనది ఒంటికన్ను విధానమే అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారో తెలియడం లేదని,రాష్ట్ర ప్రయోజనాలు ప్రధానమా లేక చంద్రబాబు నాయుడు ఆధిపత్యం ప్రయోజనాలు కాపాడడం ప్రధానమా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఇప్పటివరకు విమర్శనాత్మకంగా చూడడం తప్ప దాన్ని ప్రయోజనాత్మకంగా చూడడం లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష కోట్లు అంటున్నారని, అందులో మేడిగడ్డ డ్యామేజ్ 500 కోట్లు అది కూడా ఎలంటి వాళ్లు రిపేర్ చేసిఇస్తా అంటున్నారని తెలిపారు . డిఏపి ధర రూ.1350 ఉంటే ఇప్పుడు రూ.2150 అయిందని, ఇప్పటివరకు సొసైటీలకు ట్రాన్స్పోర్ట్ భారం లేకుండే ఇప్పుడు అది కూడా వేస్తున్నారని, ఇప్పటివరకు సొసైటీలో 266 ఉన్న యూరియా ధర ఇప్పుడు 300 అవుతుందని, ఇప్పుడు రైతుకు అదనంగా 30 రూపాయల భారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు ముఖ్యంగా విద్యుత్తు మరియు ఎరువులు అవసరమని,ఇందులో ఎరువుల మీద ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు.రసాయనిక ఎరువులు వ్యవసాయం మినహా ఇతర పనులకు ఉపయోగించరాదు అలాంట ప్పుడు యాప్ పెట్టి రైతాంగాన్ని ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ఈ రేవంత్ రెడ్డి, మోడీ ఎం చెప్పారో తెలియదు కాని కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగా యాప్ రూపొందించిందని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు అయినా యాప్ ను పక్కన పెట్టాలని కోరారు.మాజీ మండల ఉపాధ్య క్షులు రాం చందర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సాగి సత్యం రావు,తేలు రాజు, కొక్కు గంగారాం,యశ్వంత్,మండల బిఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఫోటో అంశంపై స్పందన హర్షనీయం

**-అభయహస్తం అమలుపై దృష్టి సారించాలి**

**-బీజేపీ నాయకులు మామిడిపల్లి ప్రసాద్**



**చురకలు విలేకరి ఎండపల్లి ఆగష్టు 07 :** కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫోటోను ముద్రించాలని డిమాండ్ చేస్తూ " కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫోటో సాధన సమితి " పేరుతో ఉద్యమం చేస్తున్న దళిత సంఘాల ఉద్యమానికి తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మద్దతు తెలపడం హర్షణీయమని బిజెపి జగిత్యాల జిల్లా నాయకులు మామిడిపల్లి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ పరిణామం తెలంగాణ రాష్ట్ర దళితులంతా హర్షించదగ్గ విషయమే అయినప్పటికీ మంత్రి లక్ష్మణ్ కుమార్ దళితులపై చిత్తశుద్ధితో ఈ డిమాండ్ కు మద్దతు తెలిపినట్లైతే, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చిన అంబేడ్కర్ అభయ హస్తం పథకం అమలుపై కూడా మంత్రి అడ్లూరి స్పష్టత నివ్వాలని మామిడిపల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్ అభయహస్తం పథకం కింద ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు అందజేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి, అధికారం చేపట్టాక ఆ పథకం ఊసే కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తడం లేదని, ఈ పథకం అమలు కోసం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా దళిత సామాజిక వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వాన్ని ఒప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రసాద్ ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రి లక్ష్మణ్ కుమార్ దళితులపై కపట ప్రేమను మానుకొని " కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫోటో ముద్ర సాధన సమితి "కి చిత్తశుద్ధితో మద్దతు తెలిపి ఉద్యమంలో పాల్గొనాలని, అలాగే రాష్ట్రంలో అంబేడ్కర్ అభయ హస్తం పథకం అమలు చేసే విధంగా ముఖ్యమంత్రిని ఒప్పించి పథకం అమలుకు చర్యలు చేపట్టి దళిత సామాజిక వర్గంపై తన చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు.

## ఘనంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం



**చురకలు విలేకరి ఎండపల్లి,ఆగష్టు 07 :** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాలు, జగిత్యాల జిల్లా ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి రేణిగుంట్ల సాగర్ మాదిగ సూచనల మేరకు ఎండపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఉమ్మడి వెల్గటూర్ మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు చెన్న కుమారస్వామి ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు మోకెనపల్లి సతీష్ మాదిగ మాట్లాడుతూ, మంద కృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఈ నిర్ణయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు మంతెన లక్ష్మణ్, గజ్జెల రాజేష్, మండల ఉపాధ్యక్షుడు మామిడిపల్లి సంతోష్, నాయకులు ఎనగందుల రమేష్, అశోక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకే ఫాగింగ్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 7 :** దోమల నివారణకే జూలపల్లి గ్రామంలో ఫాగింగ్ నిర్వహించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి గ్రామంలోని మల్లికార్జున నగర్, ఆది వరహాల నగర్, యాదవ నగర్, అంబేద్కర్ నగర్, తదితర ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పరిసర ప్రాంతాల్లో చిత్తచెదారం లేకుండా చూడాలని పేర్కొన్నారు. ముందుగా తమ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం రాజ మహేందర్, వార్డు సభ్యులు బొల్లంపల్లి సంతోష్ కుమార్, ఇరుగు రాళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ దరఖాస్తులు స్వీకరించాలి

**- గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుల స్వీకరణ**

**- అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**- ఇబ్రహింపట్నం ఎంపిడిఓ సిహెచ్ గణేష్**




**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (07) :** కొత్త పెన్షన్ కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల ఎంపీడీవో సిహెచ్ గణేష్ శుక్రవారం పేర్కొన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని గోదుర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండ,యామపుర్, ఫకిర్ కోండాపుర్, వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్,ఎర్దండి, కోమటికోండా పుర్, వర్షకోండ, డబ్బ, అమ్మకపెట్, ఎర్రాపుర్, ఇబ్రహింపట్నం, కేశాపుర్, కోజన్ కోత్తుర్ గ్రామాల్లో కొత్త పెన్షన్ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు స్వీకరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి,అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి నమోదు చేయాలన్నారు. వితంతు పెన్షన్, దివ్యాంగుల పెన్షన్,ఒంటరి మహిళల పెన్షన్, గీత కార్మికుల పెన్షన్, చేనేత కార్మికుల పెన్షన్, ఫైలేరియా బాధితుల పెన్షన్, డయాలసిస్ రోగుల పెన్షన్‌లకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించ నున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు అవసరమైన పత్రాలతో గ్రామ పంచాయతీ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీఓ సీహెచ్ గణేష్ కోరారు.

# సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

**-వేములకుర్తి పల్లెదావఖాన ఎంఎల్ హెచ్ పి రమ్య**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (07) :** పౌష్టికాహారం తిసుకోని సిజనల్ వ్యాదులపట్ల అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఇబ్రహిం పట్నం వేములకుర్తి పల్లెదావఖాన ఎంఎల్ హెచ్ పి రమ్య అన్నారు. ఈసందర్భంగా మండలంలోని వేములకుర్తి గ్రామంలో అంగన్వాడీ కేంద్రలలో అంగన్వాడీ టిచర్ లు కుమారం మాదవి,లోక సరిత,పుప్పాల రమ్యలు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ హెచ్ పి రమ్య మాట్లాడుతూ వర్షకాలం లో ప్రబల్లె వ్యాదులపట్ల అప్రమత్తంగా ఉండలనీ,ఎప్పుడు వేడి ఆహారం పౌష్టికాహారం తిసుకోవలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత,శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే ప్రయోజనాల గురించి వివరించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తల్లి మరియు బిడ్డ ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. కేంద్ర లలో సాముహిక అక్షరబ్యాసం,శ్రీమంతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తరి రామ నుజం,ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ముదాం బలచందర్,ఏఎన్ ఎం సుజాత, ఉపాధ్యాయులు ,ఆశా కార్యకర్త లు లవణ్య, బగ్యలక్షి,మేఘన,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐగా పదోన్నతి



**చురకలు విలేకరి, జగిత్యాల,ఆగష్టు 07 :** ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న వావిలాల గంగాధర్, అబ్దుల్ రషీద్‌లు ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం కరీంనగర్ ఆర్ఐఓ మోహన్ వారికి స్టార్ అలంకరించి పదోన్నతిని అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా జోనల్ ఇన్‌స్పెక్టర్ బాణాల రాజేందర్, ఇంటెలిజెన్స్ విభాగం రిటైర్డ్ ఎస్సై వెంకన్నలు పదోన్నతి పొందిన గంగాధర్, అబ్దుల్ రషీద్‌లను అభినందించారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ఏఎస్ఐగా పదోన్నతి పొందిన గంగాధర్‌కు ఎమ్మెల్యే సంజయ్ శుభాకాంక్షలు**

జగిత్యాల: జగిత్యాల ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వావిలాల గంగాధర్ ఏఎస్ఐగా పదోన్నతి పొందిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతితో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరి నాగభూషణం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ చేయడానికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 7:** సేవ చేయడానికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక అని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు. అన్నారు. శుక్రవారం రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి హాస్పిటల్ వైద్యులచే కంటి వైద్య శిబిరం రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 127 మందికి కంటి పరీక్షలు చేయగా 54మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి హాస్పిటల్ కు వైద్యతో సహా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సుమారు 3549 మందికి కంటి ఆపరేషన్లతో పాటుగా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్,లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,చార్టర్డ్ ప్రెసిడెంట్ మోర హన్మాండ్లు, టెక్నీషియన్ ప్రభాకర్,కౌన్సిలర్ పుర్రె శ్రీధర్,క్లబ్ సభ్యులు బత్తిని భూమయ్య,మ్యాకల రమేష్,మచ్చ శేఖర్,కొమ్ముల ఆదిరెడ్డి,దాసరి గంగాధర్,కట్ల నర్సయ్య,కుర్మ సుదర్శన్ రెడ్డి,నిమ్మల వెంకట్ రెడ్డి,గంట్యాల ప్రవీణ్,మండలోజు శ్రీనివాస్,ఏలిగేటి అనిల్,వాసం రాజేందర్,పులి రమేష్,అశోక్,సత్యనారాయణ,గ్రామీణ వైద్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

### -కస్తూర్బా గురుకుల పాఠశాలలో తహసిల్దార్ ఆకస్మిక తనిఖీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఆగష్టు 07 :** విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ డి. సుజాత శుక్రవారం అల్మాస్పూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆమె, వంటగది పరిశుభ్రత, వంట చేసే విధానం, ఆహారం వడ్డించే తీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టోర్‌రూమ్‌ను పరిశీలించి, ఫ్రిడ్జ్‌లలో నిల్వ ఉంచిన కూరగాయలు మరియు ఇతర నిత్యావసర సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. కాలం చెల్లిన సరుకులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించ కూడదని, తాజా కూరగాయలనే వినియోగించాలని ఆదేశించారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వంట చేయాలని, రోజూ పాలు, గుడ్లు తప్పనిసరిగా అందించాలని తహసిల్దార్ స్పష్టం చేశారు. ఆహారంలో రుచితో పాటు పరిశుభ్రత కూడా సమానంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపల్, వంట సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# గొల్లపల్లిలో గాలం చెరువు తూము లీకేజీకి మరమ్మతులు

### -సకాలంలో స్పందించిన సర్పంచ్
### -ఇరిగేషన్ అధికారులకు రైతుల కృతజ్ఞతలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఆగష్టు 07 :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామ గాలం చెరువు నిండిపోయింది. ఈ సందర్భంగా చెరువు తూము వద్ద నీటి లీకేజీ ఏర్పడటాన్ని గమనించిన రైతులు వెంటనే గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ గ్రామపంచాయతీ నుంచి జేసీబీని పంపించి తక్షణ చర్యలు చేపట్టారు. అలాగే ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కర్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఇరిగేషన్ ఏఈ భాస్కర్ రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతు పనులు చేపట్టారు. తూము వద్ద ఏర్పడిన లీకేజీని పూర్తిగా అరికట్టి చెరువు భద్రతను పటిష్టం చేశారు. సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించిన గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, ఇరిగేషన్ ఏఈ భాస్కర్ రెడ్డి మరియు సిబ్బందికి గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, ఏఈ భాస్కర్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ సిబ్బంది, వార్డు సభ్యులు గొర్రె మల్లేశ్ యాదవ్, పర్శరాములు గౌడ్, యువ నాయకులు వెంకటేష్ రెడ్డి, రైతులు గోగురి శ్రీనివాస్ రెడ్డి, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ‘శ్రీరామ హృదయం’ నగర సంకీర్తన



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఆగష్టు 07 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం “శ్రీరామ హృదయం” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బిటుకూరి గోపాల ఆచార్యులు నగర సంకీర్తన నిర్వహించి అనంతరం ప్రత్యేక పూజలు,ఆర్చనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీరామనామ సంకీర్తనలో పాల్గొన్నారు. అపర రామానుజులు, పద్మభూషణులు, పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవం నవంబర్ 8న దీపావళి రోజున జరగనున్న నేపథ్యంలో లోకక్షేమార్థం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని పెద్దలు నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగా “సత్సంగము” కార్యక్రమాన్ని 29-07-2026 నుంచి 26-10-2026 వరకు 90 రోజులపాటు ఇంటింటా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ఆచార్యుల శ్రీసూక్తి వినడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. “శ్రీరామ హృదయం” కార్యక్రమం ద్వారా యాంత్రిక జీవితంలో మానవీయ విలువలు, ప్రేమ, ఆప్యాయత, సఖ్యత, గౌరవం, స్నేహభావం కుటుంబాల్లోనూ సమాజంలోనూ పెంపొందాలని నిర్వాహకులు పేర్కొన్నారు. శ్రీరామచంద్రుడిని హృదయంలో నిలుపుకొని, ఆయన ఆదర్శాలను ఆచరించాలనే సందేశాన్ని భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, గోదా గోష్టి మహిళలు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శిశువుల ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో మేలు



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 07 :** వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో తల్లి పాల వారోత్సవాలు నీర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గజ్జెల మొగిలయ్య హాజరై మాట్లాడుతూ... “శిశువుల ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని, బిడ్డకు జన్మనిచ్చిన మొదటి గంటలోనే తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని” పేర్కొన్నారు. ప్రతి తల్లి కూడా ఈ విషయమై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అగన్వాడి టిచర్లు పద్మ, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బోనాలు

### -బోనం ఎత్తిన చిన్నారులు



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 07 :** వీణవంక మండలం హిమ్మత్ నగర్ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పులతో పోచమ్మ తల్లి దేవాలయం వద్దకు వెళ్లి ముక్కులు చెల్లించుకున్నారు. విద్యార్థులు పోతరాజు వేషధారణ ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా సర్పంచ్ శ్రీకాంత్ హాజరై.. తెలంగాణలో అతిపెద్ద పండుగ అయిన బోనాల పండుగను గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చిన్నారుల మీసాదరణ ఆకట్టుకుందని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యం,టీచర్స్ వేణు, ప్రియాంక, రజిత, ఉప సర్పంచ్ శ్రీనివాస్, అంగన్వాడి టీచర్లు,వార్డ్ మెంబర్లు,విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ పథకం




**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 07 :** వీణవంక మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, మండల ఇన్చార్జి అంబాల మధునయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ..2004లో పేదరికంతో బాధపడుతున్న గుండెజబ్బుల చిన్నారులు మరియు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న నిరుపేదల ప్రాణాలను కాపాడాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల ఫలితంగానే, పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే ‘ఆరోగ్యశ్రీ’పథకం ఏర్పడింది.” అప్పటి ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పర్లపల్లి తిరుపతి, కండే మహేందర్, అంబాల రాజేష్, జీడి తిరుపతి ,రమేష్ ,రాజు, మహంకాళి శ్రీనివాస్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ మండిపాటు



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 07 :** వీణవంక మండల అధికారుల అశ్రద్ధ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేష్‌గౌడ్ ఆగ్రహంవ్యక్తం చేశారు.వర్షాకాలం వస్తున్నా పారిశుధ్యం సరిగాలేక సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, సామాన్యులకు ఇసుక దొరక్క ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్లపేరుతో కొందరు కాంగ్రెస్ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ..దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ నరసింహరాజు,నాయకులు ఆదిరెడ్డి,వినోద్ కుమార్,ఉడుత కుమార్,పెద్ది మల్లారెడ్డి,సర్పంచులు వీరస్వామి,రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

## పురాణిపేట పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ

**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 7 :** జగిత్యాల పట్టణంలోని పురాణిపేట ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం, వంటశాల, భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, బోధన విధానాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యారంగంలో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం నేర్చుకునే తపనతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# 10న చలో ఇందిరా పార్క్‌ను విజయవంతం చేయండి

**-దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం మహా నిరసన**



**చురకలు ప్రతినిధి,మంథని, ఆగస్టు 7 :** దళిత క్రైస్తవులకు జరుగుతున్న చారిత్రాత్మక అన్యాయానికి వ్యతిరేకంగా ఈనెల 10న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరగనున్న "చలో ఇందిరా పార్క్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, కరీంనగర్ డిస్ట్రిక్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షులు పాస్టర్ తాళ్లపల్లి జాషువా పిలుపునిచ్చారు.శుక్రవారం మంథని పట్టణంలోని పాత పెట్రోల్ బంకు సమీపంలో "చలో ఇందిరా పార్క్" పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పాస్టర్ తాళ్లపల్లి జాషువా మాట్లాడుతూ దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కులను హరించిన రాష్ట్రపతి ఉత్తర్వులు అమలులోకి వచ్చిన ఆగస్టు 10వ తేదీన ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవ మహా నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గద్దపాటి విజయం రాజు పాల్గొంటారని పేర్కొన్నారు. దళిత క్రైస్తవులకు దశాబ్దాలుగా జరుగుతున్న వివక్షను తొలగించి, ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ హోదా సాధనే లక్ష్యంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల నుండి దళిత క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలివచ్చి, తమ ఐక్యతను, ఉద్యమ స్ఫూర్తిని చాటాలని కోరారు. ఈ మహా నిరసన సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు అంకరి కుమార్, పాస్టర్ గంగరాజు,పాస్టర్ ఎం రాజకుమార్, పాస్టర్ మచ్చ డేవిడ్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 07 :** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నియోజకవర్గంలోని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి అందే శ్యాములు మాదిగ నేతృత్వంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి అక్కడి వృద్ధులకు కూడా పండ్లు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన చిన్నారుల గుండె జబ్బుల చికిత్స కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేసిన పోరాటమే ఆరోగ్యశ్రీ పథక ఆవిర్భావానికి దారితీసిందన్నారు. 2004లో ఖమ్మం జిల్లా మధిరకు చెందిన నసీమ అనే బాలిక గుండె శస్త్రచికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భంలో మందకృష్ణ మాదిగ స్పందించి, అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డిని కలిసి పోరాటం చేయడం ద్వారా ప్రభుత్వానికి పేదల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారని పేర్కొన్నారు.ఆరోగ్యశ్రీ కేవలం వైద్య పథకం మాత్రమే కాకుండా సామాజిక ఆరోగ్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 7న ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దాసరి దేవచంద్రన్, పాటి సాగర్, అందే చంద్రం, మార్వాడి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లారెడ్డిపేట మండల జర్నలిస్టుల

# నివాస స్థలాల సాధన కమీటీ ఏర్పాటు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆగస్టు 07 :** ఎల్లారెడ్డిపేట మండల జర్నలిస్టుల నివాస స్థలాలసాధనా కమీటీ సభ్యులుగా నిమ్మ బాల చందర్ రెడ్డి (సాక్షి) బండారి బాల్ రెడ్డి (చురకలు)శ్యామంతుల అనిల్ (ఎ6వెలుగు) కట్టెలబాబు (ప్రజా దర్బార్ )ఓగ్గు బాల్ రాజు యాదవ్ (తెలుగు ప్రభ ) కూలేరి కిషోర్ (బలగం ) చంద్రమోహన్ రెడ్డి (ఆంద్ర ప్రభ) లను వివిధ దినపత్రికలకు చెందిన జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఎల్లారెడ్డిపేట మండలంలోని అర్హత కలిగిన అక్రిడిటేషన్ నాన్ అక్రిడిటేషన్ జర్నలిస్ట్ లందరికి ఇండ్ల స్థలాలు ఇప్పించడం కోసం ఈ కమిటీ తాత్కాలికంగా పనిచేస్తుంది,అందుకు సంబంధించిన నివాస స్థలాల కోసం ప్రతిఒక్క జర్నలిస్టు వ్యక్తిగత దరఖాస్తుతో పాటు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ,ఆధార్ కార్డు ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డు అది లేనివారు పత్రిక యజమాన్యం ఇచ్చిన గుర్తింపు కార్డులతో దరఖాస్తులు పూర్తిచేసి కమిటీ సభ్యులకు అప్పగించాలి. దరఖాస్తుల పైల్ మొత్తాన్ని జిల్లాలో జరుగుతున్న అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తయిన తర్వాత కమిటీ సభ్యులతో పాటు నివేశన స్థలాల కోసం కమిటీకి దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టుల అందరితో కలిసి వెళ్లి జిల్లా కలెక్టర్ ను స్వయంగా కలిసి అర్హులైన జర్నలిస్టు లందరికీ నివేశనా స్థలాలు ఇప్పించాలని వినతి పత్రం ఇవ్వాలని,దరఖాస్తు ఫారాలను కలెక్టర్ ను నేరుగా కలసి అందించాలని చర్చించినట్లు తెలిపారు.

# మంథని నుండి 14న శ్రీకృష్ణ సేవా విద్యానిధి యాత్ర

**-యాదవ విద్యానిధి యాత్రను విజయవంతం చేయండి**

**-జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్**




**చురకలు ప్రతినిధి, మంథని, ఆగస్టు 7 :** యాదవ విద్యార్థుల ఉన్నత విద్య కోసం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న "యాదవ విద్యార్థి వసతి గృహం" నిధుల సేకరణలో భాగంగా ఈనెల 14 నుండి 21 రోజుల పాటు "శ్రీకృష్ణ సేవా - విద్యానిధి యాత్ర" నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్ తెలిపారు. శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న మంథని నుండి ప్రారంభమయ్యే ఈ యాత్ర వచ్చే నెల సెప్టెంబర్ 3 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. యాదవ విద్యార్థుల్లో చైతన్యం నింపి, ఉన్నత విద్య పట్ల ఆసక్తి పెంచడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. మంథనినియోజకవర్గంలోని యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా యాదవ విద్య నిధి యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ ట్రస్ట్ అధ్యక్షులు మారం తిరుపతి యాదవ్, ట్రస్టు సభ్యులు పర్స బక్కన్న యాదవ్, మంథని మండల యాదవ సంఘం అధ్యక్షుడు పర్శవేన మోహన్ యాదవ్, జిల్లా కార్యదర్శి ఉడుత పర్వతాలు యాదవ్, జిల్లా నాయకులు కనవేన శ్రీనివాస్ యాదవ్, నాయకులు వేముల లక్ష్మణ్ యాదవ్, కనగంటి ఓదెలు యాదవ్ , బాస అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిఇంటిపై జాతీయ జెండా ఎగరాలి... దేశభక్తిని చాటి చెప్పండి

**-బీజేపీ రాష్ట్రకార్యసభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి**

**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ ఆగస్టు 08 :** ఆగస్టు 15న జరగబోయే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తలపెట్టిన హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం,'తిరంగా యాత్ర' లను సక్సెస్ చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మహాత్మా నగర్ లోని శ్రీ తపాలా లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కళ్యాణ మండపంలో హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం సన్నాక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ తిరంగా యాత్ర నిర్వహణ కోసం బిజెపి శ్రేణులు సమాయత్తం కావాలని, దేశభక్తిని చాటేలా ఈ నెల 10 నుండి దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాములు ప్రారంభం అవుతాయని తెలిపారు. మండల పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ప్రోగ్రామ్ లను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని విజయవంతం చేపట్టి, ప్రజలు విద్యార్థులు ఇట్టి కార్యక్రమంలో



పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు.అలాగే ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషుల, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు శుద్ధి చేసి,స్మారకచిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు అన్ని మండలాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే సామాజిక ఉద్యమంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాములు ప్రతిఏటా ఘనంగా జరుగుతున్నాయని నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

**అన్ని గ్రామాల్లో జాతీయ జెండాలు రెపరెపలాడాలి.. చింతం శ్రీనివాస్..**

హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాం లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండాలు ప్రతి ఇంటిపై ఎగరాలని,ఆ దిశగా పార్టీ శ్రేణులు కృషి చేసి,కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.ముఖ్యంగా ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ నిబంధనల వల్ల పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ అర్హతల నిబంధనలు పేదలు, వృద్ధులు, వితంతు మహిళలు మరియు నిజమైన అర్హుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా 70 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం అత్యంత అన్యాయమైన నిర్ణయం అన్నారు. 57 సంవత్సరాల వయస్సు దాటిన ఎంతో మంది పేద వృద్ధులు పని చేయలేని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు.అలాంటి వారిని పెన్షన్‌కు దూరం చేయడం దారుణమన్నారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత వయస్సును 70 సంవత్సరాల నుంచి 57 సంవత్సరాలకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే వితంతు మహిళలకు 40 సంవత్సరాల వయోపరిమితి విధించడం కూడా పూర్తిగా అన్యాయమని,భర్తను కోల్పోయిన మహిళ ఏ వయస్సులో ఉన్నా ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున,వితంతు పెన్షన్‌కు ఎలాంటి వయోపరిమితి లేకుండా అర్హులైన ప్రతి వితంతు మహిళకు పెన్షన్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల న్నారు.ప్రజల విజ్ఞప్తులను ప్రభుత్వం పట్టించుకోకపోతే, ఈ అన్యాయమైన నిబంధనలను ఉపసంహరించుకోకపోతే,భారతీయ జనతా పార్టీ తిమ్మాపూర్ మండలశాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కల్యాణ్ చంద్ర,జిల్లా ఈసీ మెంబర్ మావురపు సంపత్ మండల జనరల్ సెక్రెటరీ గొట్టిముక్కల తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు పాశం రాఘవరెడ్డి ,ఎర్రోజు లక్ష్మణ్,ఎలుక పెల్లి స్వామి, బుర్ర శ్రీనివాస్,పడాల శ్రీను, విశ్వరూప చారి బూత్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి ,రాపర్తి రవీందర్, నరేషు ,గంటూ రాజు ,పిట్ట మహేశ్ మాడిశెట్టి నరేష్ ,బుడిగ మహేష్ కుమార్ ,మహేందర్ రెడ్డి, జక్కోజు అనిల్ ,బూరుగు శ్రీనివాస్ రెడ్డి, కామర వెంకటేష్, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గోరింట పూచింది..కొమ్మాలేకుండా..

**-సింగాపురం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల గోరింటాకు, బోనాల సందడి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్, ఆగస్టు 7 :** హుజురాబాద్ మండలం సింగాపురంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బోనాలు, గోరింటాకు కార్యక్రమాన్ని విద్యార్థులు, అధ్యాపకులు సందడిగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై పెట్టుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గోరింటాకు పెట్టుకుని, సంప్రదాయ పాటలు, నృత్యాలతో సందడి చేశారు. దీంతో కళాశాల ప్రాంగణం రంగురంగుల అలంకరణలతో, సాంస్కృతిక వాతావరణంతో కళకళలాడింది. వి ఎస్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు తెలంగాణ ఆచారాలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను కూడా పరిరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.అజయ్ కుమార్,జి తిరుపతి,కోమల,రమాదేవి, హరీష్, సదయ్య,మహేష్,అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో సౌందర్యలహరి




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మంథని ఆగస్టు 7 :** మంథని పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం శ్రీ సౌందర్య లహరి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గట్టు (గొలుగుల) మాధవి బృందం ఆలపించిన ఈ కార్యక్రమం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గత రెండు సంవత్సరాలుగా పట్టణంలోని అనేకమంది మహిళలు భక్తి భావన పెంపొందించుకోవడంలో మాధవి ఎంతో తోడ్పాటును అందిస్తుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు మహావాది జలజ, ఆలయ అర్చకుడు శ్రీనివాస్, పట్టణంలోని మహిళా భక్తులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీని కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

**-బిజెపి నేతల డిమాండ్**
**-హుజురాబాద్ సిఐకి ఫిర్యాదు**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 7 :** హుజురాబాద్ పట్టణంలోని బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై అనుచిత వ్యాఖ్యలతో కూడిన స్టిక్కర్లు అంటించిన ఘటనపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక పట్టణ ఇన్స్పెక్టర్ కరుణాకర్ కు శుక్రవారం ఫిర్యాదు సమర్పించారు. అనంతరం పట్టణ బిజెపి అధ్యక్షుడు తూర్పాటి రాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫ్లెక్సీలను ధ్వంసం చేయడంతో పాటు వాటిపై వ్యక్తిగతంగా ప్రధాన మంత్రిని కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు రాయడం దారుణమన్నారు. ప్రధాని మోదీ చిత్రపటంపై అనుచిత వ్యాఖ్యలతో స్టిక్కర్లు అంటించడం ద్వారా ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం కొందరు చేశారని ఆయన ఆరోపించారు. సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి బాధ్యులను గుర్తించి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు




పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదన్నారు.ఈ కార్యక్రమంలో 21 వ వార్డ్ కౌన్సిలర్ పంజాల మనోజ్,మంచికట్ల మురళి, పట్టణమాజీ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, సెంట్రల్ ఫిలింబోర్డ్ మెంబర్ సబ్బని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సల్‌లో లష్కర్ బోనాలు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 7 :** పెద్దపల్లి జిల్లా, పాలకుర్తి మండలం, ఘన్ శ్యామ్ దాస్ నగర్ కు చెందిన ప్రముఖ పాఠశాల అయిన "యూనివర్సల్ ఐ.ఐ.టి. ఫౌండేషన్ స్కూల్"లో అంగరంగ వైభవంగా జరిగిన "ఆషాడ లష్కర్ బోనాల పండగ "సంబరాలు. " శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సంప్రదాయంలో భాగంగా శుక్రవారం రోజున "యూనివర్సల్ పాఠశాల " లో



బోనాల సంబరాలు జరిగాయి. విద్యార్థులు సంస్కృతి ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులలో వచ్చి గ్రామదేవతలకు"బోనం" తయారు చేసి



పసుపు కుంకుమలతో, వేపాకు లతో బోనాలు అలంకరించి మేళ తాళాలతో బోనాలెత్తుకుని ర్యాలీ గా వెళ్ళి నైవేద్యాలు సమర్పించారు. పాఠశాల ప్రాంగణంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. బాలురు పోతరాజు వేష దారణలో అందరినీ అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ గారు జ్యోతి ప్రజ్వలనం చేసి, అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ . మహ్మద్ ఇస్మాయిల్ , ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్



మాట్లాడుతూ మన సంస్కృతిని కాపాడుకోవాలని సందేశం అందించారు. తదనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణమైనది.

### అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత

# బొచ్చు శంకర్‌కు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 7 :** సింగరేణి ఆర్, జి-3 ఎస్ అండ్,పిసి లో సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న బొచ్చు శంకర్, కు జాతీయస్థాయిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు రావడం పట్ల ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు, శనివారం గోదావరిఖని పట్టణంలోని తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ భవన్ లో జరిగిన సన్మాన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కవ్వంపల్లి సతీష్, బొచ్చు శంకర్, కు పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు రెండు దశాబ్దాలుగా సింగరేణిలో ఎస్ ఓ పి సి లో విధులు నిర్వహిస్తున్న బొచ్చు శంకర్ సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ స్థాయిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డును అందజేయడం పట్ల బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణకు,ధన్యవాదాలు తెలిపారు. కరోనా సమయంలో అనేకమంది కి వైద్య సేవలతో పాటు భోజన సౌకర్యం ఏర్పాటుచేసిన బొచ్చు శంకర్, సింగరేణి తోపాటు ఇతర అనార్థులకు ఆర్థికంగా తను తన మిత్రుల ద్వారా ఆర్థిక సహాయం చేశారు.సామాజిక కార్య క్రమాల్లో పాల్గొంటూ తన దాతృత్వాన్ని చాటుకుంటున్నారని ఈ సందర్భంగా బొచ్చు శంకర్ సేవలను కొనియా డారు.అందరికీ ఆత్మీయుడుగా పేరున్న బొచ్చు శంకర్ మరింత ఉన్నత స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ నాయకులు పలువురు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ ఆకునూరి బాలంకూస్ అధ్యక్షతన జరిగిన, సన్మాన కార్యక్రమంలో, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కవ్వంపల్లి సతీష్,జనగామ రాజనర్సు ,పెగడపల్లి నారాయణ,గద్దల శశి భూషణ్ ,కండేసాగర్,బూడిద సమ్మయ్య, మేకల సురేష్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు బూడిద మహేందర్ పుల్లూరి మహేందర్ పంజా అశోక్ కాంపల్లి జీవన్ కుమార్,రామగిరి రమేష్ జిలకర రామస్వామి, తదితరులు పాల్గొన్నారు

# గంజాయి వ్యసన నిర్మూలనే లక్ష్యం



**- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి**
**-డీ-అడిక్షన్ సెంటర్ బాధితుల కోసం క్యారం, చెస్ బోర్డులు అందజేత**
**-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 07 :** జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూనే, వ్యసనానికి గురైన బాధితులను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకు రావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ సుమన్ రావు గారికి డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితుల వినియోగార్థం క్యారం,చెస్ బోర్డులను అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సేవలు,అవసరమైన సౌకర్యాలు కల్పించి, వారు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.గంజాయి వ్యసనానికి బానిసై ఆ అలవాటు నుంచి బయటపడాలని స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారు పోలీసు శాఖను సంప్రదించాలని ఎస్పీ కోరారు. అటువంటి వారికి అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి, డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించి నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందించి, వారిని తిరిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ఉక్కుపాదం మోపడంతో పాటు, వాటి వినియోగదారులపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. వ్యసనానికి గురైన వారికి అవగాహన కల్పించి, అవసరమైతే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించి చికిత్స అందించే కార్యక్రమాలను కూడా నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు.గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం లేదా గంజాయి వ్యసనానికి బానిసై స్వయంగా మానలేని పరిస్థితిలో ఉన్న వ్యక్తుల వివరాలు తెలిసిన వెంటనే సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ అడ్మిన్ సురేష్, వైద్యులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 7 :** జిల్లాలో స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారుల తో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించేందుకు సమన్వయ సమావేశంలో ఏర్పాట్ల పై శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహణ ఏర్పాట్ల పై ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకల ప్రాంగణంలో ప్రజాప్రతి నిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, విశిష్ట అతిథులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు సౌకర్యవంతంగా పాల్గొనేలా కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేదిక, జాతీయ పతాకావి ష్కరణ, పరేడ్, ముఖ్య అతిథి సందేశం, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమా లను ప్రజలకు చేరువ చేసేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆకర్షణీయమైన ప్రదర్శన శకటాలు, అవగాహన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమ విభాగం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల ఫలితాలు ప్రతిబింబించేలా శకటాలు, ప్రదర్శనలు రూపొందిం చాలని తెలిపారు. ఉత్తమ ప్రదర్శనలు, వినూత్న శకటాలు, ఆకర్షణీయమైన స్టాల్స్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా తెలియజేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వేడుకల నిర్వహణలో పాల్గొనే ప్రతి శాఖ అధికారి తమ బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లాకు ఆదర్శంగా నిలిచేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### అంగన్వాడి కేంద్రంలో

# తల్లి పాల వారోత్సవాలు



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ ఆగస్టు 08 :** అల్లునూర్ 3 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారో త్సవాల సందర్భంగా తల్లులకు అవగా హన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ పద్మ తల్లులకు ముర్రుపాల ప్రాముఖ్యత గురించి వివరించారు.బ్రెస్ట్ ఫీడింగ్ బిడ్డకు ఏ విధంగా ఇవ్వాలి,ఎలాంటి ఆహారం తీసుకుంటే తల్లిపాలు సమృద్ధిగా వస్తాయో తెలిపారు.ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆరు నెలలు నిండిన తర్వాతనే కాంప్లిమెంటరీ ఫీడింగ్ మొదలు పెట్టాలని,బాటిల్ పాలు ఇవ్వడం ద్వారా వచ్చే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. డెలివరీ తర్వాత కూడా ఐరన్, కాల్షియం సప్లిమెంట్స్ తీసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా అన్నప్రాసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు జమున, కవిత, లత, అన్నపూర్ణ, అంగన్ వాడి ఆయా, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

# నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

**-యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి**




**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఆగస్టు 7 :** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని కోరుతూ డివిజన్ విద్యుత్ కార్యాలయం ముందు శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది మాట్లాడుతూ,విద్యుత్ రంగం ప్రజలకు అత్యంత కీలకమైన సేవా రంగమని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని,యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగుల భద్రత, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.విద్యుత్ సంస్థలను లాభాపేక్షతో కాకుండా ప్రజా సేవాదృక్పథంతోనిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ అజీజ్, మెట్‌పల్లి డివిజన్ జేఏసీ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, సెక్రటరీ హరి ప్రసాద్, జేఏసీ నాయకులు లక్కంపల్లి సురేష్, ఎండి కరీం, శంకరయ్య, రవీందర్, భోయినపల్లి అశోక్, మహేష్, కమలాకర్, శరణ్య, లక్ష్మీ, రాజమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.